క్లుప్తంగా

గొట్టం బావిని కాపాడండి


బావిని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంచాల: ప్రజల దాహార్తి తీర్చిన గొట్టం బావిని కబ్జా చెర నుంచి కాపాడాలని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు మాదగోని జంగయ్య గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆరుట్ల గ్రామంలో గొట్టం బావిని ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. మూడు దశాబ్దాల క్రితం గ్రామ ప్రజల తాగునీటి అవసరాల కోసం బావిని తవ్వించారని తెలిపారు. సుదీర్ఘకాలం తాగునీటిని అందించిన బావిని కొందరు కబ్జాచేశారని ఆరోపించారు. సంబంధిత అధికారులు స్పందించి కబ్జాచెర నుంచి బావిని పరిరక్షించాలని కోరారు. భవిష్యత్ తరాల అవసరాలకు ఉపయోగ పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


బాధితులకు చెక్కులు అందజేస్తున్న కృష్ణ

మంచాల: ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను సీపీఎం జిల్లా నాయకుడు పోచమోని కృష్ణ పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ బొల్లి నర్సిరెడ్డి సహకారంతో మంజూరైన చెక్కులను ఆయన శుక్రవారం మండల పరిధి బండలేమూర్ గ్రామంలో ముడిగె మల్లయ్యకు రూ. 60వేలు, బూడిద పార్వతమ్మకు రూ.13,500, బూడిద యాదమ్మకు రూ.7వేల చొప్పున చెక్కులు అందజేశారు.

ఆకట్టుకున్న బాలసభ


విద్యార్థుల ప్రదర్శన

ఆమనగల్లు: బాలుర బాలసభ ఆకట్టుకుంది. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం వందేమాతరం ఫౌండేషన్, అక్షరజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు డీఈఓ, ఎంఈఓగా వ్యవహరించారు. తోటి వారికి పాఠాలు బోధించారు. పొడుపుకథలు వేశారు. నృత్యం చేశారు. ఈ సందర్భంగా చిన్నారుల ప్రతిభ చూసిన ఉపాధ్యాయ బృందం వారిని అభినందించింది. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పాండు, ఉపాధ్యాయులు అశోక్‌రెడ్డి, మాధవి, సుజాత, ఆచారి, వనిత, కుసుమలత, పద్మ, రమాదేవి, శ్రీధర్, వందేమాతరం ఫౌండేషన్ వలంటీర్ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

వరలక్ష్మిగా సరస్వతీ మాత


అమ్మవారికి పూజలు చేస్తున్న మాతృమండలి సభ్యులు

యాచారం: శ్రావణ మాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని నందివనపర్తి గ్రామంలో శ్రీ జ్ఞాన సరస్వతి.. వరలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి జ్ఞాన సరస్వతి సేవాసమితి, మాతృమండలి సభ్యుల పర్యవేక్షణలో అలంకరణ చేశారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

అదనపు బస్సు తిప్పండి


ఆర్టీసీ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ఇబ్రహీంపట్నం: బండలేమూర్ గ్రామానికి అదనపు ఆర్టీసీ బస్సు నడిపించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఇబ్రహీంపట్నం అసిస్టెంట్ మేనేజర్ రాజేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఉదయం 8 గంటలకు, సాయంత్రం 4 గంటలకు కుదాస్‌పల్లికి వెళ్లే బస్సు బండలేమూర్ మీదుగా నడిచే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. దీనికి స్పందించిన అధికారి.. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు.

అందుబాటులోకి పీఏసీఎస్ గోదాం


పీఏసీఎస్ నూతన గోదాం

- రూ.76 లక్షలతో నిర్మాణం పూర్తి
- నేడు ప్రారంభించనున్న ఎంపీ మల్లు, ఎమ్మెల్యే కసిరెడ్డి

తలకొండపల్లి: వెయ్యి మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల పీఏసీఎస్ గోదాం రైతులకు అందుబాటులోకి రానుంది. రూ.76 లక్షలు నాబార్డు నిధులతో మండల కేంద్రంలో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం గోదాం.. ప్రారంభోత్సవానికి సిద్ధమయింది. వెయ్యి మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న గిడ్డంగిలో వరి, మొక్కజొన్న తదితర ధాన్యాలను నిల్వ చేసుకునే సౌకర్యం ఉండటంతో అన్నదాతలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

8వేల మంది సభ్యులు

తలకొండపల్లి పీఏసీఎస్ పరిధి మండలంలోని 32 గ్రామ పంచాయతీలతో పాటు, కడ్తాల్ మండలంలోని 7 గ్రామాలతో మొత్తం 39 జీపీలు ఉన్నాయి. పరపతి సంఘానికి ఈ పంచాయతీల నుంచి 8000 మంది సభ్యులు ఉన్నారు. ఇదిలా ఉండగా శనివారం ఉదయం 10 గంటలకు పీఏసీఎస్ మండల చైర్మన్ గట్ల కేశవరెడ్డి ఆధ్వర్యంలో ఎంపీ డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లా (డీసీసీబీ) చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా సీఈఓ లక్ష్మయ్య తదితరులు ప్రారంభించనున్నారు.

కృషి ఫలించింది



రైతులు భవిష్యత్తులో ఇబ్బంది పడకూడదనే 2005 నుంచి ఇప్పటి వరకు రూ.కోటి 40 లక్షలతో మండల కేంద్రంలో పీఏసీఎస్ భవనం,పడకల్, వెల్జాల్‌లో పీఏసీఎస్ గోదాంల మరమ్మతులు తదితర పనులు చేయించాను. ఇందులో భాగంగా తలకొండపల్లిలో వెయ్యి మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాం నిర్మాణం పూర్తయింది. దీంతో నా కృషికి తగిన ఫలితం దక్కింది. పీఏసీఎస్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకొని అభివృద్ధికి పాటుపడాలి.

– గట్ల కేశవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్, తలకొండపల్లి

విద్యార్థులకు అండగా ఉండండి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి


రెడ్డి సేవా సమితి భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

తలకొండపల్లి: రెడ్డీలందరూ పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి అండగా నిలవాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సూచించారు. మండల పరిధి రాంపూర్‌లో రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు హరిమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించిన సమితి భవనాన్ని శుక్రవారం ఎమ్మెల్యే కసిరెడ్డి, సమితి కల్వకుర్తి నియోజకవర్గ నాయకుడు శేఖర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. సమాజ సేవలో ప్రతి ఒక్కరూ ముందుండాలని చెప్పారు. తమ సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను రెడ్డి నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో సమితి మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి, శతాబ్ది టౌన్‌షిప్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డి, స్థలదాత హరి మోహన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్యాం సుందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన వద్దు.. అర్హులందరికీ మాఫీ

- వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌గౌడ్
- ముమ్మరంగా ఇంటింటి సర్వే


ఆమనగల్లు: దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఓ

ఆమనగల్లు: ఆందోళన వద్దు.. అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల పరిధి ఆకుతోటపల్లి, శెట్టిపల్లి గ్రామాల్లో శుక్రవారం ఆయన ఇంటింటి సర్వే చేశారు. ఈ సందర్భంగా లబ్ధిపొందని రైతుల వివరాలను సేకరించారు. అనంతరం మాట్లాడారు. రుణమాఫీ పొందని వారు మరలా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్జీల ఆధారంగా గ్రామాల్లో పర్యటిస్తూ కుటుంబ నిర్ధారణ చేపడతామన్నారు. కార్యక్రమంలో ఏఈఓ భూదేవి పాల్గొన్నారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్: అర్హులైన ప్రతి ఒక్కరికి రుణమాఫీ అందుతుందని ఏఓ శ్రీలత అన్నారు. మాఫీ లబ్ధిపొందని రైతుల వివరాల సేకరణలో భాగంగా ఆమె శుక్రవారం మండల పరిధి న్యామతాపూర్ గ్రామంలో ఇంటింటి సర్వే చేశారు. అర్హులైన రైతులు, వారి కుటుంబీకుల వివరాలు, ఫొటోలు, ఆధార్ కార్డులను సేకరించారు. అనంతరం ప్రత్యేకంగా రూపొందించిన రుణ యాప్‌లో ఆ వివరాలను పొందుపరిచారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ.. రుణమాఫీ గురించి ప్రతి గ్రామంలో సర్వే చేస్తున్నట్లు ఆమె వెల్లడించారు. కార్యక్రమంలో ఏడీఏ ఆదిలక్ష్మి, ఏఈఓలు వందన, రమేశ్, అభినవ్, కేదార్‌సింగ్ రైతులు పాల్గొన్నారు.

ముగిసిన విగ్రహప్రతిష్ఠాపనోత్సవం

వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే సబితారెడ్డి


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి తదితరులు

మహేశ్వరం: విగ్రహప్రతిష్ఠాపనోత్సవ ఉత్సవాలు అంగరంగ వైభవంగా ముగిశాయి. మూడు రోజులుగా కొనసాగిన శివ నందీశ్వర, పోచమ్మ, నాగదేవత విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ పూజలు శుక్రవారంతో సమాప్తం అయ్యాయి. మండల పరిధి మాణిక్యమ్మగూడలోని శివాలయంలో ఉదయం అభిషేకం, పుష్పాలంకరణ, పంచామృతాభిషేకం, పాత కాల పూజలు, హోమాలు తదితర పూజలు చేశారు. మధ్యాహ్నం నందీశ్వర, పోచమ్మ, నాగదేవత యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, అష్ట బలి, మహాబలి, పూర్ణాహుతి, నేత్రోన్మీలనం, విశేష అలంకారం దర్శనం, రుత్విక్ సన్మానం పలు రకాల పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఆదివారం అమ్మవారికి బోనాలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ అర్బన్ ఫైనాన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, ఎమ్మెల్యే పి.సబితారెడ్డి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ పాండు యాదవ్, వైస్ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, మాణిక్యమ్మగూడ మాజీ సర్పంచ్ చంద్రయ్య గౌడ్, మాణిక్యమ్మ గూడ గ్రామ దేవాలయ కమిటీ అధ్యక్షుడు మల్లేశ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి తిరుతిరెడ్డి, దయాకర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశ్ యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, భూపాల్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే ధ్యేయం

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య


మహిళా సంఘం సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కాలె

మొయినాబాద్: మహిళల ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ ధ్యేయమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మహిళా సమాఖ్య భవనంలో శుక్రవారం మహిళా సమాఖ్య వార్షిక మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు విరివిగా రుణాలు మంజూరు చేస్తుందని చెప్పారు. గతేడాది మండలంలో 1,050 సంఘాలకు రూ.50.40 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందజేశామన్నారు. మహిళలకు మంజూరు చేసే రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ సందర్భంగా రూ. 29.80 కోట్ల రుణాల చెక్కులను మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, ఎంపీడీఓ సంధ్య, ఏపీఎం రవీందర్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అశ్విని, కోశాధికారి శ్రీనాకుమారి, వీసీసీ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, సభ్యుడు షాబాద్ దర్శన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాణయ్య, మాజీ ఎంపీటీసీ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన మోటార్ చట్టాన్ని రద్దు చేయాలి

సీఐటీయూ సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్


నూతన కమిటీ సభ్యులతో దేవేందర్, సీహెచ్ ప్రవీణ్‌కుమార్ తదితరులు

మొయినాబాద్ రూరల్: ప్రభుత్వం తెచ్చిన నూతన మోటార్ వెహికిల్ చట్టాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ చౌరస్తాలో ఆటో స్టాండ్ సమీపంలో ఆటో కార్మికుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అల్లి దేవేందర్ మాట్లాడుతూ ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. నూతన చట్టం వలన అధిక చలాన్లు వేసి ట్రాఫిక్ పోలీసులు ఆటో కార్మికులను వేధిస్తున్నారని ఆరోపించారు. వెంటనే 2019 నూతన మోటార్ వెహికిల్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు.

నూతన కమిటీ..

అజీజ్‌నగర్ ఆటో అడ్డా యూనియన్ నూతన అధ్యక్షుడిగా మహేందర్, ప్రధాన కార్యదర్శిగా చెన్నయ్య, కోశాధికారిగా సయ్యద్ ఉస్మాన్, ఉపాధ్యక్షుడిగా రాజేందర్, బాబు, సహాయ కార్యదర్శులుగా వినోద్, మహ్మద్ అహ్మద్, మరో 20 మందిని నూతన కమిటీలో సభ్యులుగా నియమించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ప్రవీణ్‌కుమార్, సీహెచ్ ప్రవీణ్‌కుమార్, గ్రామ పంచాయతీ జిల్లా అధ్యక్షుడు రత్నం తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల త్యాగం మరువలేనిది

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న రెడ్డి సంఘం నాయకులు

షాద్‌నగర్: మహనీయుల త్యాగాలను మరువలేమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో రెడ్డి సేవా సమితి నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిశారు. పట్టణంలో రాజాబహదూర్ వెంకటరామిరెడ్డి విగ్రహ ఏర్పాటుకు సహకరించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజం కోసం, ఎలాంటి స్వార్థం లేకుండా పని చేసిన మహనీయుల అడుగుజాడల్లో నడవాలని సూచించారు. రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే విగ్రహం కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజాబహదూర్ వెంకట్‌రామిరెడ్డి గొప్ప మానవతా వాది అని గుర్తు చేశారు. నిజాం పాలనలో పేద విద్యార్థుల చదువు కోసం తన భూమిని విరాళంగా ఇచ్చిన మహనీయుడని కొనియాడారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట విగ్రహ ఏర్పాటునకు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు, సంఘం నాయకులు స్థలాన్ని పరిశీలించారు.

విద్యార్థులు క్రమశిక్షణతో నడుచుకోవాలి

ఎంపీడీఓ బాల శంకర్

మంచాల: విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణతో నడుచుకోవాలని ఎంపీడీఓ బాల శంకర్ అన్నారు. శుక్రవారం మండల పరిధి ఆరుట్ల ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు దుప్పట్లు, షూలు, కార్పెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా వింటూ.. చదువులో పోటీ పడాలని సూచించారు. ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం నుంచి మీకు పూర్తి సహకారం అందించే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎలాంటి ఇబ్బంది ఉన్నా.. వార్డెన్‌కు తెలపాలని చెప్పారు. వార్డెన్ బాషయ్య, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన


పూజాకార్యక్రమంలో భక్తులు

కడ్తాల్: మండల కేంద్రంలోని సత్యసాయి మందిరంలో స్త్రీ శక్తి లలితాంబిక బృందం, సాయి మందిర దేవాలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో లలితా పరమేశ్వరి యంత్ర విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మూడో రోజు శుక్రవారం స్థాపిత దేవతా మండపారాధన, మాల మంత్ర హోమాలు, గర్తన్యాసం, యంత్ర ప్రతిష్ఠాపన, విగ్రహప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, అమ్మవారికి పల్లకీ సేవ తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అర్చకులు, పండితులు, భక్తులు ఉన్నారు.

వైభవంగా వరలక్ష్మీ వ్రతం

కడ్తాల్: మండల కేంద్రం, పరిసర ప్రాంతాల్లో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా జరిగాయి. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్-పద్మజ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన పూజాకార్యక్రమంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఇందులో జయప్రకాశ్ జైన్, లింగమయ్యగౌడ్, ప్రభావతి, తహసీల్దార్ జయశ్రీ, నాయకులు శ్రీను, వెంకటేశ్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, ఆరోగ్య రెడ్డి, లక్ష్మమ్మ, ఉమాదేవి, రేణుక, హేమలత, సాధన, పుష్ప, సుమతమ్మ, స్వప్న, జగదీశ్వర్‌గౌడ్, సుగంధ్ ఉన్నారు.

బీసీ మహాధర్నాను జయప్రదం చేయండి


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కడ్తాల్: బీసీ మహాధర్నాను విజయవంతం చేయాలని పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బీసీ మహాసభ తెలంగాణ అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ధర్నా వాల్‌పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడారు. బీసీల సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 2న కల్వకుర్తి పట్టణంలో నిర్వహించే మహాధర్నాకు బీసీలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

హైడ్రాకు ఫిర్యాదులు

మీర్‌పేట: ప్రభుత్వ స్థలంలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను తొలగించాలని మీర్‌పేట జిల్లెలగూడకు చెందిన బండి నగేష్ శుక్రవారం హైడ్రా కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. సర్వే నం. 155లోని సర్కారు జాగను కొందరు వ్యక్తులు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని ఆరోపించారు. హైడ్రా అధికారులు స్పందించి, ఆక్రమణదారుల నుంచి భూమిని రక్షించాలని కోరారు.

కల్యాణోత్సవానికి ఆహ్వానం


ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న లింగబలిజ నేతలు

ఇబ్రహీంపట్నం: పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవానికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని వీరశైవ లింగాయత్ లింగబలిజ నాయకులు ఆహ్వానించారు. ఈ మేరకు శుక్రవారం సంఘం సెంట్రల్ కమిటీ సభ్యులు శెట్టి శివకుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శెట్టి విశ్వనాథ్‌లు ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం చెరువు కట్ట కింద వెలసిన శ్రీ భద్రకాళి వీరభద్రస్వామి ఆలయంలో ఆదివారం ఉత్సవాలు జరగనున్నాయని, ఇందులో భాగంగా ఎమ్మెల్యేను ఆహ్వానించామని పేర్కొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం


మొయినాబాద్ రూరల్: మాట్లాడుతున్న మండల అభివృద్ధి అధికారి సంధ్య తదితరులు

- వ్యాధులపై అవగాహన తప్పనిసరి
- మండల అభివృద్ధి అధికారి సంధ్య

మొయినాబాద్: పరిసరాల పరిశుభ్రతతో ఎలాంటి వ్యాధులు ప్రబలవని, సీజనల్ వ్యాధుల గురించి ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని మండల అభివృద్ధి అధికారి సంధ్య అన్నారు. మండల పరిధిలోని చిలుకూరులో ఫ్రైడే-డ్రైడేలో భాగంగా శుక్రవారం ఇంటింటికీ తిరిగి జ్వర సర్వే నిర్వహించారు. పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో ఇంటి చుట్టుపక్కల ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్, డాక్టర్ సాయిబాబా, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మొయినాబాద్ రూరల్‌లో..

మొయినాబాద్ రూరల్: గ్రామాల్లోని పరిసరాలను ప్రతిరోజు శుభ్రం చేయించాలని పంచాయతీ అధికారులను మండల అభివృద్ధి అధికారి సంధ్య, ప్రత్యేక అధికారి కిషన్‌రావు, ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డిలు ఆదేశించారు. మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, ఆరోగ్య శాఖ అధికారులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో చెత్తా చెదారం పేరుకుపోయి, మురుగు గుంతలు ఏర్పడి దోమలు, ఈగలు పెరుగుతున్నాయని చెప్పారు. దీంతో విషజ్వరాలు, రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. కాబట్టి ప్రతిఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

కేశంపేటలో..

కేశంపేట: సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ రవి చంద్రకుమార్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ రాజ్, ఎడ్యుకేషన్, ఆరోగ్యశాఖ, వెటర్నరీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిచంద్రకుమార్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో శానిటేషన్ నిర్వహించాలన్నారు.

కాంగ్రెస్‌తోనే అందరికీ సమన్యాయం

క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్షియల్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్‌జాన్


సమావేశంలో మాట్లాడుతున్న దీపక్‌జాన్

షాద్‌నగర్ రూరల్: కాంగ్రెస్‌తోనే అన్ని మతాలు, వర్గాలకు సమన్యాయం దొరుకుతుందని క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్షియల్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్‌జాన్ అన్నారు. శుక్రవారం షాద్‌నగర్ పట్టణంలోని గుడ్ షెఫర్డ్ కమ్యూనిటీ చర్చిలో పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాస్టర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దీపక్‌జాన్ మాట్లాడుతూ మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులు జరిగినా ఏ ఒక్కరు మాట్లాడలేదని పేర్కొన్నారు. ఈ ఘటనపై కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ మాత్రమే మాట్లాడి, అక్కడికి బాధితులను పరామర్శించారని గుర్తు చేశారు. కొంత మంది నేతలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం క్రైస్తవుల మధ్య చిచ్చు పెట్టేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రతి నియోజకవర్గంలో సుమారు 20వేల మంది క్రైస్తవ జనాభా ఉందని, అందరూ ఐకమత్యంతో మెలిగితేనే హక్కులు సాధించుకోవచ్చని సూచించారు. క్రిస్టియన్ల అభ్యున్నతికి తెలంగాణ ప్రభుత్వం అనేక పథకాలను రూపొందించి అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రెవరెండ్ స్వామిదాస్, ఉపాధ్యక్షుడు తిమోతి, జోసఫ్ ఫ్రాంక్లిన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సమన్వయ సమావేశం

తుర్కయంజాల్: గణనాథుల నిమజ్జనం నేపథ్యంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు తుర్కయంజాల్ రొక్కం సత్తిరెడ్డి గార్డెన్స్‌లో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు పుర కమిషనర్ కె.అమరేందర్ తెలిపారు. ఈ సమీక్షలో మున్సిపల్, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, విద్యుత్, పోలీస్, ట్రాఫిక్ పలు శాఖల అధికారులు పాల్గొననున్నారని పేర్కొన్నారు. పుర పాలక పరిధి గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు, పుర ప్రముఖులు హాజరకావాలని ఆయన కోరారు.